మన అందరి గౌరవము నిలబెట్టాలి'' అంటూ చేతులు రెండు పట్టుకుని ప్రాధేయపడసాగింది. కాని, గోపాలరావు దానికే మాత్రం అంగీకరించలేదు! కాని మేనమామ, మేనత్త, తల్లి అనేక విధాల ప్రాధేయపడుకున్న తరువాత ''సరే. మీరంతా ఇలాగ ప్రాధేయపడుకుంటు న్నారు కనక చెబుతున్నాను వినండి—నేను దీనికి ఒప్పుకుంటానంటే మాత్రం లాభమేమిటి? రమణి దీనికి అంగీకరిస్తుందో, అంగీకరించదో—ముందా సంగతి నిక్కచ్చిగా తేల్చండి!'' అంటూ నీళ్ళు నమిలాడు. అంతలోనే సుందరమ్మ రమణిని దగ్గరకు పిలిచి విషయం అంతా రహస్యంగా చెవిలో వూదింది.

''నా వాళ్ళనుకున్నవాళ్ళంతా నన్నిలాగ ర్ధరాత్రివేళ నట్టేట్లో ముంచి వెళ్ళిపోయారే! కాస్త నువ్వన్నా మా నాన్న మర్యాద, నా మర్యాద కాపాడాలే, తల్లీ! లేకపోతే తెల్లవారితే ఇక మేము వీధి ముఖం చూడలేమమ్మా!'' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

రమణి తల వంచుకుని రవంతసేపు ఆలోచించింది.

''అమ్మా! నువ్వు, నాన్నగారు కలిసి ఏది నిర్ణయించినా నాకది అంగీకారమే!''

అదే సమయంలో మీనాక్షి తటాలున అడిగింది. ''చూడమ్మా, రమణి! దీనిలో మొహమాటమేదీ లేదమ్మా! పెళ్ళి నూరేళ్ళ పంట! నీకిష్టమైతేనే ఈ వివాహం జరుగుతుంది. లేకపోతే మా నాన్న ఇంతకన్న గొప్ప సంబంధమే తీసుకు వస్తాడు. అందుచేత బాగా ఆలోచించుకో, అమ్మా! అంతేగాని అనవసరంగా తొందరపడవద్దమ్మా, నీకిష్టమో, కాదో నిక్కచ్చిగా తేల్చి చెప్పమ్మా!''

దాని మీద రమణి వెంటనే అందుకుని, ''నాకీ సంబంధమంటే ఇష్టం! ముమ్మాటికీ ఇష్టమే!'' అంటూ కచ్చితంగా తేల్చి చెప్పింది. ఆపైన గోపాలరావుకకి ఆ వివాహానికి అంగీకరించక తప్పలేదు! అంతలో రమణి మొహం పట్టరాని సంతోషంతో కళకళలాడింది.

''ఇది నంగనాచి, వంగముల్లాను మొట్టమొదటి నుంచీ ఇది లోలోపల గోపాలరావు మీదనే మమకారం పెంచుకుంది. కాని అతి గుంభనంగా అది అంతా ఆంతర్యంలోనే దాచివేసుకుంది!'' అంటూ నవ్వింది సుందరమ్మ.

ఈ వ్యవహారం తెలియని పురోహితుడు నిరుత్సాహంతో ఇంటికి తిరిగిపోతూ కాంతారావుని సెలవిప్పించమని అడిగాడు. కాని కాంతారావు—''వీల్లేదు. పెళ్ళి జరిగి తీరుతుంది. తెల్లవారుజాము ముహూర్తానికే రమణికి, గోపాలరావుకి యథావిధిగా వివాహమహోత్సవం జరిపించండి!'' అని కచ్చితంగా తన నిశ్చయం వెల్లడించాడు.

ఆ వివాహం జరుగుతున్న సమయంలో పెళ్ళికి వచ్చిన పెద్దలు కొందరు వధూవరుల నాశీర్వదిస్తూ కాంతారావును అభినందిస్తూ, ''బాబూ! ఏమిటేమిటో ఆలోచిస్తుంటాము. కాని చిట్టచివరికి జరిగేదంతా అక్షరాలా ఆ దైవ నిర్ణయమే!'' అంటూ తమ సంతోషం వ్యక్తీకరించారు. ★

# మల్లాది వెంకటకృష్ణమూర్తి మినీకథ

# ఓ పెన్ కథ




నేను పని చేసే ఆఫీస్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ బదిలీ అయి వెళ్ళిపోయారు. ఆయన స్థానంలో కొత్త ఆఫీసర్ వచ్చారు. ఆయన రాకకన్నా ముందే ఆయనకు సంబంధించిన ఒక వింత విషయం మాకు చేరింది.

ఆయన బంగారు రంగు కేప్ ఉండే పెన్నుగురించి అది.

ఆయన కోటు జేబులో సదా ఒక పెన్ ఉంటుంది. ఆయన దాన్ని ఉపయోగిస్తుండగా చూసినవారు అరుదు. పొరబాటున కూడా తన పెన్‌ని ఇతరులకి ఇవ్వడాయన.

ఆ పెన్ అంటే ఆయనకు ప్రాణం.

పాత ఆఫీసర్‌కి వీడ్కోలు, కొత్త ఆఫీసర్‌కి స్వాగతం పలుకుతూ మా ఆఫీస్ రిక్రియేషన్ క్లబ్ ఒక మీటింగ్ ఏర్పాటు చేసింది. అందరి దృష్టి కొత్త ఆఫీసర్ కోటు జేబు మీద పడింది.

బంగారు రంగుతో మెరిసిపోతూ కనపడింది పెన్ కేప్. ఆ పెన్ అంటే ఆయనకి సెంటిమెంటల్ అటాచ్‌మెంట్ ఉందని అనిపించింది నాకు—మనిషి చూడడానికి సెంటిమెంటల్‌గా అని పించడంతో.

వారం రోజులు గడిచాయి. మేం విన్న సంగతి నిజమే అని రూఢి అయింది. ఆయన తన టేబుల్ మీద ఉన్న పెన్ హోల్డర్‌లోని పెన్నులని తప్ప దాన్ని వాడగా ఎవరూ చూడలేదు.

కారణం ఏమై ఉంటుందా అని రకరకాల వూహాగానాలు చేయసాగారు స్టాఫ్ అంతా.

ఆయన యూనివర్సిటీలో గోల్డ్ మెడలిస్ట్. వైస్ చాన్సలర్ స్వయంగా దాన్ని ప్రెజెంట్ చేశారు.

—కాలేజీలో ఉండగా స్వీడిష్ ఎంబసీలోని సెకండ్ సెక్రటరీ కూతురు మెటిల్డాని ప్రేమించాడు. తండ్రికి బదిలీ అయి తన దేశానికి తప్పనిసరిగా వెళ్ళిపోవలసి వచ్చింది మెటిల్డా. అప్పుడు వీడ్కోలు బహుమతిగా ఆ పెన్ ఇచ్చింది. పాతికేళ్ళు గడిచినా ఆయన మెటిల్డాని ఇంకా మరచిపోలేక, ఆమె గుర్తుగా ఆ పెన్‌ని దాచుకున్నాడు. ఆమె ఉత్తరాలు రాయడానికి మాత్రమే ఆ పెన్ ఉపయోగిస్తాడు.

—ఆయనకి అచ్చొచ్చిన పెన్ అది. ఇండియన్ ఆడిట్ అండ్ అక్కౌంట్స్ సర్వీస్ పరీక్ష కూడా ఆ పెన్‌తో రాయటంవల్ల పాసయ్యానని ఆయనకు నమ్మకం. ముఖ్యమైన కాగితాల మీద సంతకాలకే ఉపయోగిస్తాడది.

ఏది విన్నా నిజమే ననిపిస్తోంది అందరికీ. వదంతులు ఇలాగే మొదలవుతా యనిపించింది ఒక్కొక్కరి వాదన వింటూంటే.

ఆయన పెన్ రహస్యం ఎవరూ ఛేదించలేకపోయారు.

రెండు నెలలు గడిచాయి.

ఒక రోజు ఆయన దగ్గరుండే ప్యూన్ మా సెక్షన్‌లోకి వచ్చి హడావిడిగా చెప్పాడు—

''ఆ పెన్ గురించి తెలిసిందని.''

''ఎలా తెలుసు? అడిగావా?'' అడిగాడు మా సెక్షన్ హెడ్ ఆత్రంగా.

''ఉక్కగా ఉందని కోటు విప్పి కుర్చీకి తగిలించారు. ఆయన ఇందాక బాత్‌రూమ్‌లోకి వెళ్ళగానే పెన్ తీసి చూశాను.''

అందరం అతని మొహంవంక చూశాం—ఏం చెప్తాడా అని.

''ఉట్టి కేప్ మాత్రమే ఉంది. పెన్ పోతే ప్రెస్టేజి కోసం కేప్ మాత్రమే పెట్టుకుని తిరుగుతున్నాడాయన.'' ★